కల్యాణలక్ష్మి చెక్కులు మంజూరు

కులకచర్ల, జూన్ 28: కులకచర్ల మండలానికి కల్యాణ లక్ష్మి పథకం కింద 140 మంది లబ్ధిదారులకు రూ.1,40,16,240 మంజూరైనట్లు తహసీల్దార్ మురళీధర్ తెలిపారు. 11 గ్రామాల్లో ఎస్టీలకు 38, ఎస్సీలకు 20, బీసీలకు కల్యాణ లక్ష్మి పథకం కింద 77 చెక్కులు మంజూరయ్యాయి. షాదీ ముబారక్ కింద మైనారిటీలకు 5 చెక్కులు మంజూరైనట్లు తెలిపారు. త్వరలోనే ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

తెలంగాణ పోలీస్ శాఖకు మంచిపేరు తేవాలి

▸▸ వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి


వికారాబాద్, జూన్ 28: శిక్షణ కాలం ముగిసిన తర్వాత తెలంగాణ పోలీస్ శాఖకు మంచిపేరు వచ్చేవిధంగా పని చేయాలని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. వికారాబాద్‌లోని జిల్లా శిక్షణా కేంద్రంలో శిక్షణ పొందుతున్న ట్రెయినీ కానిస్టేబుళ్లతో శుక్రవారం ఆయన మాట్లాడారు. వికారాబాద్ డీటీసీలో ఆహ్లాదకరమైన వాతావరణం ఉందన్నారు. వికారాబాద్‌లో శిక్షణ పొందటం చాలా అదృష్టమని తెలిపారు. శిక్షణ తీసుకుంటున్న అభ్యర్థుల్లో చాలా వరకు డిగ్రీలు, పీజీలు పూర్తి చేసిన వారు ఉన్నారని, ప్రతీ ఒక్కరు శిక్షణ కాలంలో క్రమశిక్షణతో, ఏకగ్రాతతో కష్టపడి పని చేయాలన్నారు. అభ్యర్థులు ప్రతీరోజు ఏదో ఒక మంచి విషయం నేర్చుకోవాలని, ఎవ్వరూ చెడు వ్యసనాల జోలికి వెళ్లకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. శిక్షణా కాలంలో చేస్తున్న యోగా, మెడిటేషన్, వ్యాయామం వంటివి శిక్షణ అనంతరమూ కొనసాగించాలన్నారు. జూలై 1 నుంచి మారుతున్న చట్టాలపై, సైబర్ నేరాలు, ఫైనాన్సియల్ ఫ్రాడ్స్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం ఎస్పీ డీటీసీలోని తరగతి గదులు, లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్, బ్యారక్‌లు, వంట గదులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీటీసీ ప్రిన్సిపాల్ మురళీధర్, డీటీసీ డీఎస్పీ విజయ్ కుమార్, ఏఆర్ డీఎస్పీ వీరేష్, డీటీసీ ఇన్‌స్పెక్టర్ వెంకట్రాం, పీసీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ప్రమీల, ఆర్ఐ నాగరాజు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలికలు

కేజీబీవీలో 26 మంది విద్యార్థినులకు అస్వస్థత

- పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలింపు.. కోలుకున్న బాలికలు
- ఫోలిక్ యాసిడ్ మాత్రలు పడకనే అస్వస్థత
- శుక్రవారం మరో ఆరుగురు ఆస్పత్రిలో చేరిక
- పరామర్శించిన కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

6



● బీఆర్ఎస్ టు కాంగ్రెస్

వేట షురూ!

బీఆర్ఎస్‌కు భారీ షాక్ ● కాంగ్రెస్‌లో చేరిన చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య

- చివరి వరకు గోప్యంగా వ్యవహరించిన కాంగ్రెస్
- ఆయన బాటలో మరికొందరు శివారు ఎమ్మెల్యేలు?
- రంగంలోకి దిగిన సీఎం రేవంత్‌రెడ్డి
- నేరుగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో చర్చలు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

అధికార కాంగ్రెస్ పార్టీ ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌కు వరుసగా షాక్‌ల మీద షాక్‌లు ఇస్తోంది. చేరికలపై దృష్టి పెట్టిన అధికార పార్టీ తాజాగా చేవెళ్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాలె యాదయ్యకు కాంగ్రెస్ కండువా కప్పింది. అనూహ్యంగా ఢిల్లీ వెళ్లిన ఎమ్మెల్యే యాదయ్య శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్ గూటికి చేరారు. వరుసగా మూడుసార్లు చేవెళ్ల నుంచి విజయం సాధించిన యాదయ్య పార్టీ మారే విషయంలో చివరకు వరకు గోప్యంగానే వ్యవహరించారు. ఇదిలా ఉంటే ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి మరికొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు త్వరలోనే కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలిసింది. నేరుగా సీఎం రేవంత్‌రెడ్డి రంగంలో దిగి చేరికలపై కొందరు ఎమ్మెల్యేలతో మాట్లాడుతున్నట్లు సమాచారం. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఆయన రాష్ట్రంలో అత్యధికంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లాపై ఫోకస్ పెంచారు. 'మా ప్రభుత్వాన్ని పడగొడతామంటే ఊరుకుంటామా? మేము నిలబడేందుకు ఏం చేయాలో అదే చేస్తామని గురువారం ఖరాఖండిగా చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి వెనువెంటనే చేరికలపై దృష్టి సారించారు. ఎమ్మెల్యేలు చేజారకుండా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న బీఆర్ఎస్‌కు షాక్ ఇస్తూ చేవెళ్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాలె యాదయ్యను శుక్రవారం గూటికి తీసుకువచ్చారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో అధికార పార్టీ ఉమ్మడి జిల్లాలో ఘోర పరాజయం చెందడంతో దిద్దుబాటు చర్యలు చేపట్టారు. రేవంత్‌రెడ్డి సిట్టింగ్ స్థానమైన మల్కాజిగిరితో పాటు చేవెళ్ల పార్లమెంట్ స్థానంలో అధికార పార్టీ ఓటమి చెందిన విషయం తెలిసిందే. త్వరలో మళ్లీ స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగనుండడంతో పార్టీని బలోపేతం చేసేందుకు, ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ద్వారాలు తెరవాలని కాంగ్రెస్ నాయకత్వం నిర్ణయించింది. పార్టీ అధినాయకత్వం కూడా ఇందుకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో సీఎం రేవంత్‌రెడ్డి చేరికలపై దృష్టి సారించారు. రాబోయే వారం రోజుల్లో ఉమ్మడి జిల్లా నుంచి భారీగా చేరికలు ఉండవచ్చని ప్రచారం సాగుతోంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో బీఆర్ఎస్‌కు అత్యధికంగా 10మంది ఎమ్మెల్యేలు ఉన్న విషయం తెలిసిందే. వీరందరిపై కూడా అధికార కాంగ్రెస్ పార్టీ కన్నేసింది. ఇప్పటికే కొందరు ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డితో టచ్‌లో ఉన్నారు. ఇద్దరు ముగ్గురు ఎమ్మెల్యేలు వేర్వేరు సందర్భాల్లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఏకాంత చర్చలు జరిపారు. వారం రోజుల్లో మరికొందరు శివారు ప్రాంత ఎమ్మెల్యేలు కాంగ్రెస్ గూటికి చేరుతున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. మరికొందరితో చర్చలు కొనసాగుతున్నట్లు సమాచారం.

దశాబ్దం తరువాత సొంతగూటికి...

చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య ఈ స్థానం నుంచి వరుసగా మూడు సార్లు విజయం సాధించారు. దాదాపు దశాబ్ద కాలం తరువాత తిరిగి ఆయన సొంతగూటికి చేరారు. కాంగ్రెస్‌లో అనేక పదవులు అనుభవించిన యాదయ్య 2014లో కాంగ్రెస్ తరపునన పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు. తరువాత ఆయన బీఆర్ఎస్‌లో చేరి 2019, 2023లో ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. మళ్లీ పదేళ్ల కాలం తరువాత యాదయ్య తిరిగి కాంగ్రెస్ గూటికి చేరడం గమనార్హం. యాదయ్య తన చేరిక విషయాన్ని చివరి వరకు గోప్యంగానే ఉంచారు. యాదయ్య పార్టీ మార్పుపై కొంతకాలంగా ఊహాగానాలు వెలువడుతున్నా ఆయన అదేమీ లేదంటూ ఖండిస్తూ వచ్చారు. బుధవారం వికారాబాద్‌లో జరిగిన జిల్లా పరిషత్ భవన సముదాయం ప్రారంభోత్సవ సభలో యాదయ్య మాజీ మంత్రి మహేందర్‌రెడ్డితో నిధుల విషయంలో కూడా స్వల్పంగా ఘర్షణ పడ్డారు. దీంతో యాదయ్య పార్టీ మార్పుపై ఎవరికీ అనుమానం కూడా రాలేదు. శుక్రవారం ఉదయం ఆయన మాజీమంత్రి చంద్రశేఖర్, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి ఢిల్లీ వెళ్లారు. ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకునే వరకు చేరిక విషయం గోప్యంగానే ఉంచారు.

కడా కింద మంజూరైన అభివృద్ధి పనులు ప్రారంభించాలి

▸▸ వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

కొడంగల్/వికారాబాద్, జూన్ 28: కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడా) కింద మంజూరైన నిధులతో పనులను ప్రారంభించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. శుక్రవారం కడా కార్యాలయంలో నియోజకవర్గ అభివృద్ధికి మంజూరైన నిధులతో చేపట్టాల్సిన పనులపై నారాయణపేట్ కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో కలిసి నారాయణపేట, వికారాబాద్ జిల్లాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి పనులను అధికారులు తమ శాఖలకు నిర్దేశించిన పనులను ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాలన్నారు. వివిధ కళాశాలల నిర్మాణం కోసం భూసేకరణ చేపట్టాలని, భూ సేకరణ విషయంలో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కొడంగల్‌లో ప్రభుత్వ ఆసుపత్రుల భవనాల నిర్మాణాల నమూనాలు, వైద్యుల నియామకానికి ప్రతిపాదనలు సమర్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కడా కింద నియోజకవర్గంలో మంజూరైన చెక్ డ్యాంల నిర్మాణ పనులపై, అటవీ శాఖ భూముల్లో జరుగుతున్న పనులపై కలెక్టర్ సంబంధిత అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోడ్లపై గుంతలు ఉండరాదని, ప్యాచ్ వర్క్ పనులు చేపట్టాలన్నారు. ప్రతీ వారం నిర్వహించే సమీక్షలో ప్రగతి నివేదికలు సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం కొడంగల్ నియోజకవర్గ కమ్యూనిటి ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సమావేశంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, డీసీహెచ్ఎస్ ప్రదీప్, వైద్యులు పాల్గొన్నారు. కాగా , ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఏవైనా సవరణలు చేసుకోదలచినవారు ప్రజా పాలన సేవ కేంద్రాల్లో సరిచేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రజా పాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

ఉపయోగం లేని సామగ్రిని తీసివేయాలి

పాఠశాలల్లో ఉపయోగంలో లేని వస్తువులను వారం రోజుల్లో తీసివేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు, మిషన్ భగీరథ ఇంటింటి సర్వేపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో పాత ఫర్నీచర్, పాడైన వస్తువులు, పేరుకుపోయిన పుస్తకాలు, పేపర్లను వారం రోజుల్లో తొలగించి పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రహరీలు లేని పాఠశాలలకు ఇనుప కంచె ఏర్పాటుకు అంచనాలు రూపొందించాలని అధికారులకు సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టే పనుల్లో ఎలాంటి నాణ్యతలోపం ఉండకూడదని తెలిపారు.కోడంగల్ మండలం గుండ్లకుంట పాఠశాలలో టాయిలెట్ నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించాలన్నారు ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, జడ్పీ సీఈవో సుధీర్, డీఆర్‌డీవో శ్రీనివాస్, డీపీవో జయసుధ, డీఈవో రేణుకాదేవి పాల్గొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

▸▸ మేడ్చల్ జిల్లాలో 87.03 శాతం, వికారాబాద్ జిల్లాలో42.14 శాతం ఉత్తీర్ణత

వికారాబాద్/మేడ్చల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల్లోనూ అవే ఫలితాలు వచ్చాయి. గత మార్చి నెలలో జరిగిన సంవత్సర పరీక్ష ఫలితాల్లో రాష్ట్రంలో ఆఖరు స్థానంలో నిలిచిన వికారాబాద్ జిల్లా అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల్లోనూ చివరి స్థానంలో నిలిచింది. గత నెలలో జరిగిన పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లాలో 5847 మంది విద్యార్థులు హాజరు కాగా, వారిలో 2464 మంది ఉత్తీర్ణులై 42.14 శాతం నమోదు చేసుకున్నారు. 3692 మంది బాలురు పరీక్ష రాయగా, వారిలో 1395 మంది ఉత్తీర్ణత సాధించగా, 2155 మంది బాలికల్లో 1395 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలురు 37.78 శాతం, బాలికలు 49.61 శాతం ఉత్తీర్ణత సాధించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 87.03 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలో మొత్తం 4,881 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వగా అందులో 4,248 విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బాలురు 3,088 మందికిగాను 2,680 మంది, బాలికలు 1,793కు గాను 1,568 మంది బాలికలు పాసయ్యారు.

శాంతి భద్రతల్లో రాజీపడొద్దు

● మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి

మేడ్చల్‌టౌన్, జూన్ 28: శాంతి భద్రతల విషయంలో రాజీపడొద్దని మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి అన్నారు. మేడ్చల్ జోన్ పరిధిలోని పోలీసు అధికారులతో ఆయన శుక్రవారం కండ్లకోయ ధ్రువ కాలేజీలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు అధికారులు కృషి చేయాలని సూచించారు. ప్రజలకు మరింత అందుబాటులోకి పోలీసు సేవలను తీసుకుకెళ్లడానికి ప్రయత్నించాలన్నారు. ప్రజల విశ్వాసంతో సమాజంలో శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు ప్రయత్నించాలని సూచించారు. జోన్ పరిధిలోని పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. సక్రమంగా విధులు నిర్వహించి శాంతిభద్రతల కోసం కష్టపడి పనిచేసే అధికారులకు తన వంతు సహాయసహకారాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ నర్సింహారెడ్డి, మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, జోన్ పరిధిలోని అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి



- పరిష్కరించాల్సిన ధరణి దరఖాస్తులు 7,801
- పరిష్కరించినవి 2వేలు మాత్రమే
- నేటితో ముగియనున్న గడువు

సమస్యలు తీరేనా!



మేడ్చల్ జూన్ 28(ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల సమగ్ర పరిష్కారానికి కొత్త రెవెన్యూ చట్టం తీసుకువచ్చేందుకు సిద్ధమౌతున్న రాష్ట్ర ప్రభుత్వం అమలులో ఉన్న ధరణి పోర్టల్ దరఖాస్తుల పరిష్కారంపై దృష్టి పెట్టింది. ఈ క్రమంలో గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉంచిన అన్ని దరఖాస్తులను పరిష్కరించే దిశగా ఇప్పటికే కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో రెండు విడతల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పోర్టల్‌లోని కొన్ని అంశాలను కలెక్టర్ నుంచి ఆర్డీవోలు, తహసీల్దార్‌కు బదిలీ చేయాలని నిర్ణయించారు. అన్నీ సిద్ధం చేసి లాగిన్ ఐడీలు ఇచ్చేలోపు లోక్‌సభ ఎన్నికలు రావడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. ఎన్నికలు ముగియడంతో తాజాగా ధరణి దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈనెల 30 వరకు దరఖాస్తుల పరిష్కారానికి ప్రభుత్వం గడువు విధించగా 29న నేడు జిల్లాల కలెక్టర్‌లతో భూరికార్డులు, పరిపాలన చీఫ్ కమీషనర్(సీసీఎల్‌ఏ) నవీన్ మిత్తల్ సమీక్షించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో అధికారులు దరఖాస్తుల పరిష్కారంపై దృష్టిపెట్టారు. ఈ నెలాఖరులోపు భూ సమస్యలపై దరఖాస్తులు(జీఎల్ఎం), టీఎం-33 మాడ్యుల్ సమస్యలతో పాటు స్పెషల్ డ్రైవ్ దరఖాస్తులను అధికారులు పరిష్కరిస్తున్నారు. అధికారులు పాత పిటిషన్లను వెలికితీసి, ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయో తెలుసుకుని ఆ సమాచారాన్ని ప్రభుత్వానికి నివేదించేందుకు సిద్ధమౌతున్నారు.

ముమ్మర కసరత్తు

జూన్ నెలాఖరులోగా ధరణి పోర్టల్‌లోని సమస్యలన్నీ పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశించడంతో జిల్లాలోని రెవెన్యూ యంత్రాంగం ధరణి దరఖాస్తుల పరిష్కారానికి ముమ్మరంగా కసరత్తు చేస్తోంది. జిల్లాలో ధరణి పోర్టల్‌లో 7,801 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా కేవలం 2 వేలకు పైగా దరఖాస్తులు మాత్రమే పరిష్కారమయ్యాయి. అదనపు కలెక్టర్, ఆర్డీవోలు, తహసీల్దార్లు పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి పరిష్కరిస్తున్నప్పటికీ చిన్న చిన్న తప్పిదాలున్న వాటిని తిరస్కరిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హద్దులు సరిగా లేవని, మిస్సింగ్ సర్వే నంబర్లు పోర్టల్‌లో లేవని, మాన్యువల్ పహాణీలో ఇతరుల పేర్లు ఉన్నాయని సాకులు చెబుతూ తిరస్కరిస్తున్నారని వాపోతున్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

తాండూరు: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ వైద్యులను ఆదేశించారు. శుక్రవారం తాండూరు ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేసే వైద్యులు సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ఆస్పత్రిలోని ప్రతి వార్డును పరిశీలించి రోగులకు వైద్యులు అందజేస్తున్న వైద్య సేవలను క్షుణంగా పరిశీలించారు. పేషంట్ల వివరాలు వైద్యుల కొరత గురించి అడిగి తెలుసుకున్నారు. ఆర్డీవో శ్రీనివాసరావు, జిల్లా ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ మూర్తి , ఆర్ఎం డాక్టర్ ఆనంద్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



పీహెచ్‌సీని సందర్శించిన డిప్యూటీ డీఎంహెచ్‌వో

యాలాల, జూన్ 28: యాలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం జిల్లా ఉప వైద్యాధికారి రాజేంద్ర యాదవ్ సందర్శించారు. ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు కిట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనూష, సామాజిక అధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

డీఏవో పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

మేడ్చల్ జూన్ 28(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ నియామక రాతపరీక్షను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఈనెల 30వ తేదీ నుంచి జూలై 4వ తేదీ వరకు కొనసాగనున్న రాత పరీక్షను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చూడాలన్నారు. బయోమెట్రిక్ విధానం అమలులో ఉన్నందున అభ్యర్థులు 2గంటల ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా చూడాలన్నారు.

కేజీబీవీలో 26 మంది విద్యార్థినులకు అస్వస్థత



అస్వస్థతకు గురైన బాలికల ఆరోగ్యంపై ఆరాతీస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, జూన్ 28: వికారాబాద్ జిల్లా పరిగి కస్తూర్బాగాంధీ పాఠశాలలో 26 మంది విద్యార్థినిలు అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొంది కోలుకున్నారు. పరిగి మండలం నస్కల్‌లోని కస్తూర్బాగాంధీ పాఠశాలలోని బాలికలకు గురువారం సాయంత్రం స్నాక్స్‌లో భాగంగా శనగలు ఇచ్చారు. అదే సమయంలో ఐరన్ పోలిక్‌యాసిడ్ మాత్రలు ఇచ్చారు. తర్వాత రాత్రి పది గంటల తర్వాత విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వారిని వెంటనే పరిగిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్ర అస్వస్థతకు గురైన ఎల్.లావణ్య, ఎ.అనూష, వి.నందిని, జి.స్వందన, ఎస్.నిహారిక, వి.ఇందు, కె.ఇందులకు ప్రత్యేక చికిత్సలు అందించారు. కాగా విద్యార్థినులందరూ కోలుకున్నారు. అయితే బాలికలు పోలిక్‌యాసిడ్ మాత్రలు వేసుకోవడం వల్లనే అస్వస్థతకు గురైనట్లు డీసీహెచ్‌వో డాక్టర్ ప్రదీప్ తెలిపారు. ఈ మాత్రలు కొందరికి పడవని చెప్పారు.

శుక్రవారం మరో ఆరుగురికి అస్వస్థత

శుక్రవారం సాయంత్రం ఆరుగురి బాలికలకు మళ్లీ అస్వస్థతకు గురయ్యారు. వీరికి పరిగి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. గురువారం రాత్రి చికిత్స పొంది డిచ్చార్జీ అయినా స్వప్న, అనూష, ఝాన్సీ, ఇందు, మేఘన, నందినిలకు మళ్లీ అస్వస్థతకు గురయ్యారు. వీరిని కేజీబీవీ పాఠశాల సిబ్బంది పరిగి అస్పత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు. ప్రస్తుతం వీరు కోలుకుంటున్నారు. అలాగే వైద్య శాఖ ఆధ్వర్యంలోని నస్కల్‌లోని కేజీబీవీలో ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేసి వైద్య చికిత్సలు అందిస్తున్నారు.

పరామర్శించిన కలెక్టర్, ఎమ్మెల్యే

నస్కల్‌లోని కస్తూర్బాగాంధీ పాఠశాలలోని బాలికలు అస్వస్థతకు గురైన విషయాన్ని తెలుసుకున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్ పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, ఆర్డీవో వాసుచంద్ర, డీఈవో రేణుకాదేవి, తదితరులు పరిగి ప్రభుత్వ అస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించారు. అస్వస్థతకు గురైన బాలికలకు మెరుగైన వైద్యాన్ని అందించాలని సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీసీహెచ్‌వో ప్రదీప్, పరిగి ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజశేఖర్, వైద్యబృందం దగ్గర ఉండి చికిత్సలు అందించారు. అనంతరం నస్కల్‌లోని కస్తూర్బాగాంధీ పాఠశాలను సందర్శించారు. విద్యారినులు అస్వస్థతకు గురికావడానికి కారణాల గురించి వారు సిబ్బందితో మాట్లాడి తెలుసుకున్నారు.

రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్
- ఆస్పత్రి సూపరింటెండెంట్‌పై ఆగ్రహం
- రోగులు నిలబడకుండా చికిత్సలు అందించాలని ఆదేశం



పరిగి ఆస్పత్రికి వచ్చిన రోగులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్

పరిగి, జూన్ 28: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల నిర్లక్ష్యంచేస్తే కఠిన చర్యలు తప్పవని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ హెచ్చరించారు. కేజీబీవీ విద్యార్థినులు అస్వస్థతకు గురికాగా ఆయన పరామర్శించడానికి వెళ్లారు. రోజూ ఎంత మంది ఓపీ పేషెంట్లు వస్తున్నారు? వారందరికీ చికిత్స అందుతుందా? అని అడిగి తెలుసుకున్నారు. రోగుల పేర్ల రిజిష్టర్ కౌంటర్ వద్ద గుంపులుగుంపులుగా కనిపించడంపై కలెక్టర్ వారి దగ్గరకు వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. ఇంతమంది 'సమిగుడితే ఏం చేస్తున్నారని డాక్టర్లు, సిబ్బందిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. రిజిష్టర్ తర్వాత చేసుకోవచ్చని, ముందుగా ఆధార్ చూపించగానే చికిత్సలు అందించాలని సూచించారు. రోగులు గుంపులుగా కనిపించకూడదని, ఎందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయలేదని ఆస్పత్రి సూపరిండెంట్ రాజశేఖర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగులకు చికిత్సలు అందించడంలో వైద్య సిబ్బంది ఒళ్లు దగ్గర పెట్టుకుని సేవలు అందించాలన్నారు. రోగులకు చికిత్స, విధుల పట్ల ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా ఇంటికి పంపిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో రేణుకాదేవి, డీసీహెచ్‌వో ప్రదీప్, ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజశేఖర్, తహసీల్దార్ ఆనంద్ రావు, ఎంఈవో హరిశ్చందర్ పాల్గొన్నారు.

వర్షాల కోసం అన్నదాతల ఎదురుచూపులు



బండవెల్కిచర్ల గ్రామ పరిధిలో విత్తనాలు నాటడానికి సిద్ధం చేసిన పొలం

కులకచర్ల, జూన్ 28: వర్షాల కోసం అన్నదాతలు ఎదురుచూస్తున్నారు. రోజూ మేఘాలు కమ్ముకుంటున్నా వర్షాలు మాత్రం కురువకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. రాష్ట్రమంతా విస్తారంగా వర్షాలు కురుస్తున్నా కులకచర్ల ప్రాంతంలో ఆశించిన వర్షాలు కురవడం లేదు. ఇప్పటికీ ఈప్రాంతంలో పూర్తిస్థాయిలో విత్తనాలు నాటలేదు. రోహిణీ కార్తెలో కొద్దిపాటి వర్షాలు కురువగా కొంతమంది రైతులు అక్కడక్కడ విత్తనాలు నాటారు. అయితే అవి మొలకెత్తినా వర్షాలు లేక వాడుముఖం పడుతున్నాయి. చాలా గ్రామాల్లో రైతులు ఇంకా విత్తనాలు నాటడానికి పొలాలను సిద్ధంచేసి ఉంచారు. కురిసిన కొద్దిపాటి వర్షాలకు గుట్టలపై ఉన్న, పొలాల్లో ఉన్నచెట్లు పచ్చబడ్డాయి. కానీ పంటలు పూర్తి స్థాయిలో సాగుకు నోచుకోలేదు. దీంతో వరుణుడి రాక కోసం రైతన్నల ఎదురుచూపులు తప్పడంలేదు.

ప్రమాదకరంగా గుంత



ఎల్లకొండలో రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న గుంత

నవాబుపేట, జూన్ 28: మండలంలోని ఎల్లకొండలో కావలి గోపాల్ ఇంటి సమీపంలో పెద్ద గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనదారులు ప్రమాదవశాత్తు పడిపోయి గాయాలపాలవుతున్నారు. గుంతను తవ్వి రెండు నెలలు గడుస్తున్నా నేటికీ పూడ్చకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదని స్థానికులు వాపోయారు. వర్షాకాలం కావడంతో గుంతల్లో నీరుచేరి ఆ మార్గంలో వచ్చీపోయే వారికి గుంత కనిపించడంలేదు. దీంతో వాహనదారులు ప్రమాదబారిన పడుతున్నారు. ఈ గుంతల్లో వర్షపు నీరు నిలిచి దోమలు ప్రబలే అవకాశముందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి వెంకటలక్ష్మిని వివరణ కోరగా గుంతపడిన విషయం తమ దృష్టికి రాలేదని తెలిపారు. గుంతను రెండు రోజుల్లో పూడ్చివేయిస్తామని ఆమె తెలిపారు.

తాండూరుకు తాకిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం

- ఎన్నికల ముందు డాక్టర్ సంపత్ కుమార్ ఫోన్ ట్యాపింగ్
- నిర్ధారించిన విచారణ అధికారులు



డాక్టర్ సంపత్ కుమార్

తాండూరు, జూన్ 28: సెల్‌ఫోన్ ట్యాపింగ్ వ్యవహారానికి సంబంధించి ఇప్పటికే కొంత మంది అధికారులు జైల్లో ఉన్న సంగతి విదితమే. రాష్ట్ర వ్యాప్తంగా గత ప్రభుత్వ హయాంలో సెల్‌ఫోన్ ట్యాపింగ్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం బయటపెట్టి విచారణ జరుగుతున్న విషయం విదితమే. ఈ క్రమంలో తాండూరుకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సంపత్ కుమార్‌కు చెందిన రెండు సెల్‌ఫోన్లు ట్యాపింగ్ జరిగినట్లు విచారణ అధికారులు నిర్ధారించారు. హైదరాబాద్ ఫిలింనగర్‌కు చెందిన పోలీస్ అధికారి ఒకరు డాక్టర్ సంపత్ కుమార్‌కు ఫోన్ చేసి శాసనసభ ఎన్నికల ముందు మీ రెండు ఫోన్లు ట్యాపింగ్ జరిగాయని వివరించారు. అయితే ఇది తను ఊహించిందేనని డాక్టర్ సంపత్ కుమార్ విచారణ అధికారికి వివరించారు. డాక్టర్ సంపత్ కుమార్‌కు చెందిన సెల్‌ఫోన్లు ఎవరు ట్యాపింగ్ చేయించారని విషయమై చర్చనీయమైంది. శాసన సభ ఎన్నికల ముందు బీఆర్ఎస్‌లో కొనసాగిన సంపత్ కుమార్ పార్టీ మారి కాంగ్రెస్‌లో చేరడంతో పాటు కాంగ్రెస్ పార్టీ తాండూరు ఎమ్మెల్యే టికెట్ కూడా ఆశించారు. కాంగ్రెస్‌లో కీలకమైన వ్యక్తిగా వ్యవహరించిన డాక్టర్ సంపత్ కుమార్ ఫోన్లు ట్యాపింగ్ చేసిన వ్యక్తులు పోలీస్ విచారణలో బయటపడే అవకాశం ఉంది.

చీఫ్‌విప్ బాధ్యతలు చేపట్టని ఎమ్మెల్సీ

- మంత్రి పదవిపై ఆశలు



మహేందర్‌రెడ్డి

తాండూరు, జూన్ 28: త్వరలో మంత్రివర్గ విస్తరణ ఏర్పడుతుందని వస్తున్న వార్తలతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి తనకు వచ్చిన ప్రభుత్వ చీఫ్‌విప్ పదవిని ఇంకా చార్జ్ తీసుకోవడం లేదు. మహేందర్‌రెడ్డికి ప్రభుత్వ చీఫ్‌విప్ పదవిని కట్టబెడుతూ రాష్ట్ర ప్రభుత్వం మార్చి 15న జీవో 103ను విడుదల చేసింది. ఎన్నికల కోడ్ దృష్టిలో పెట్టుకొని చార్జి తీసుకోకుండా నెట్టుకొచ్చారు. ప్రస్తుతం కోడ్ గడువు ముగిసినా ప్రభుత్వ చీఫ్‌విప్ పదవిని చార్జి తీసుకోకుండా ఉంటున్నారు. చార్జి తీసుకుంటే ఆపదవికే పరిమితం కావాల్సి వస్తుందని, మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు. ఈమేరకు తన ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు సమాచారం. ఇప్పటికే ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో సీనియర్ ఎమ్మెల్యేలుగా మల్‌రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి రేసులో ఉన్నారు. అవకాశం వస్తే మంత్రి పదవిని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆశిస్తున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పట్టు కోసం మాజీ మంత్రి ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి తనకు అవకాశమున్న ప్రయత్నాలు చేపడుతున్నారు. ఇప్పటికే బెంగళూరులో వారం రోజుల కిందట మకాం వేసి అక్కడ కాంగ్రెస్ ముఖ్య నాయకుల ద్వారా ప్రయత్నాలు చేపట్టినట్లు తెలుస్తోంది.

మూడు కిలోల క్లోరల్ హైడ్రేట్ పట్టివేత

- బషీరాబాద్‌లో కల్లులో కలిపే మత్తు పదార్థం గుర్తింపు
- వ్యక్తిపై కేసు నమోదు

బషీరాబాద్, జూన్ 28: ఓ వ్యక్తి మూడు కిలోల క్లోరల్ హైడ్రేట్ తరలిస్తుండగా పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలంలో హెడ్‌కానిస్టేబుల్ మల్లేషం ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది శుక్రవారం గస్తీ నిర్వహిస్తుండగా, స్థానిక నవాంద్గీ రైల్వేస్టేషన్‌వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. సదరు వ్యక్తిని తనిఖీ చేయగా అతడి వద్ద సీహెచ్(క్లోరల్ హైడ్రేట్) కల్లులో కలిపే 3 కిలోల మత్తుపదార్థం లభించింది. బషీరాబాద్‌లోని కొడంగల్ రాజుగౌడ్ వద్ద నుంచి సీహెచ్ తీసుకెళ్తున్నానని, తన పేరు రాజేష్‌చౌహాన్, కర్ణాటక ప్రాంతామని తెలపగా, నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కొంతకాలంగా కర్ణాటక నుంచి సీహెచ్‌ను పెద్ద ఎత్తున తీసుకొచ్చి బషీరాబాద్ కేంద్రంగా కొందరు విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు తెలిసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్‌కుమార్ తెలిపారు.

విరబూసిన బ్రహ్మకమలాలు

ఘట్‌కేసర్, జూన్ 28: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎన్ఎఫ్‌సీ నగర్‌లో బ్రహ్మ కమలాలు విరబూశాయి. ఎన్ఎఫ్‌సీనగర్‌లోని బీ-1లో నివాసముండే అలపాటి మల్లిఖార్జున్ రావు ఇంటి ఆవరణలో అనేక రకాల పూలమొక్కలు, పండ్లచెట్లతోపాటు వివిధ రకాల తీగజాతి మొక్కలను పెంచుతున్నాడు. గురువారం రాత్రి ఆయన ఇంట్లోని బ్రహ్మకమలం చెట్టుకు ఒకటికాదు రెండు కాదు ఏకంగా ఆరు పువ్వులు వికసించాయి. కేవలం రాత్రి సమయంలోనే పుష్పించే ఈపుష్పాలు సూర్యోదయంతో వాడిపోతాయి. బ్రహ్మకమలం పుష్పాలు వికసించిన విషయం తెలుసుకున్న స్థానికులు వాటిని చూసేందుకు మల్లిఖార్జున్‌రావు నివాసానికి బారులుతీరారు.


ఘట్‌కేసర్: ఎన్ఎఫ్‌సీనగర్‌లో విరబూసిన బ్రహ్మకమలాలు

కొడంగల్ రూరల్: శివుడికి ప్రీతిపాత్రమైన, అరుదుగా పుష్పించే బ్రహ్మ కమలాలు కొడంగల్‌లోని లాహోటీ కాలనీలో ఓ ఇంటి ఆవరణలో గురువారం రాత్రి వికసించాయి. లాహోటీ కాలనీలో నివాసముండే అధ్యాపకుడు బత్తుల మల్లయ్య ఇంటి పెరట్లో నాలుగు బ్రహ్మ కమలాలు వికసించడంతో కుటుంబ సభ్యులు, కాలనీవాసులు పుష్పాలకు పూజలు చేశారు.

గౌరవ వేతనాలు తక్షణమే చెల్లించాలి: చింపుల

రంగారెడ్డి అర్బన్, జూన్ 28 : జడ్పీటీసీలకు, ఎంపీపీలకు గౌరవ వేతనాలు వెంటనే ఇవ్వాలని తెలంగాణ పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జడ్పీటీసీలు, ఎంపీటీసీల పదవీకాలం జూలై 4 వరకు ముగియనున్నట్లు చెప్పారు. ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనం వెంటనే ఇవ్వాలని కోరారు. దేశంలో అత్యంత కీలకమైన పంచాయతీరాజ్ వ్యవస్థ, గ్రామాల పటిష్ఠతకు జడ్పీటీసీలు, ఎంపీటీసీలు ఎంతో కృషి చేశారని వారికి గౌరవ వేతనాలను ఇవ్వక పోవడం అవమానకరమన్నారు.

గెస్ట్ లెక్చరర్లకు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, జూన్ 28: వికారాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ సబ్జెక్టులు బోధించడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జె.మల్లయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంగ్లీష్, పొలిటికల్ సైన్స్, మ్యాథ్స్, ఫిజిక్స్ కంప్యూటర్ సైన్స్, జువాలజీ, బోటనీ, కామర్స్ సబ్జెక్టుల్లో ఒక్కో పోస్టు ఉందని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు సంబంధిత సబ్జెక్టుల్లో పీజీలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50శాతం, ఇతరులకు 55శాతం మార్కులు ఉండాలన్నారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ అర్హత ఉండి, బోధనా అనుభవం గల వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. పీహెడీ, నెట్, సెట్ అర్హత కలిగిన అభ్యర్థులు అందుబాటులో లేకపోతే అర్హులైన పీజీ అభ్యర్థులను తీసుకుంటామని వివరించారు. అర్హులైన అభ్యర్థులు జూలై 2వ తేదీ, సాయంత్రం 4గంటల వరకు తమ దరఖాస్తులపై కళాశాలతో అందజేయాలని సూచించారు. ఇతర వివరాలకు 9347053673, 98660 99526 నంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

ఓగీపూర్ నాపరాతి గనుల్లో విద్యుత్ లైన్లపై సర్వే

తాండూరు రూరల్, జూన్ 28: మండలంలోని కరన్‌కోట్ 33/11 కేవీ సబ్‌స్టేషన్ నుంచి ఓగీపూర్ నాపరాతి గనుల వరకు ఐదున్నర కిలోమీటర్ల దూరంలో 11కేవీ విద్యుత్ వైర్లను పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించినట్లు తాండూరు మండల విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ కె.వెంకట్‌నాయడు తెలిపారు. మండలంలోని ఓగీపూర్ నాపరాతి గనిలో ముందస్తుగా విద్యుత్ అంతరాయం కలగకుండా ఉండేందుకు శుక్రవారం సర్వే నిర్వహించినట్లు తెలిపారు. ఈసర్వేలో విద్యుత్ సరఫరా జరుగుతుందా, విద్యుత్ వైర్లకు చెట్ల కొమ్మలు ఏమైనా తగులుతున్నాయా, నాపరాతి పాలిషింగ్ యూనిట్ల వినియోగదారులకు ఇబ్బందులు ఏమైనా కలుగుతున్నాయా అనేదానిపై తమ సిబ్బందితో వెళ్లి వినియోగదారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు తెలుసుకున్నట్లు తెలిపారు. ముందస్తుగా విద్యుత్ సరఫరాలో అంతరాయాన్ని అరికట్టేందుకే సమగ్ర సర్వే నిర్వహించినట్లు తెలిపారు. కరన్‌కోట్ సబ్‌స్టేషన్‌లో 33/11కేవీ ద్వారా నాపరాతి పాలిషింగ్ యూనిట్లకు ఏమేరకు సరఫరా జరుగుతుందని, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అనేదానిపై వివరాలను సేకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్‌ఇన్‌స్పెక్టర్ గరివప్ప, జూనియర్ లైన్‌మన్ సాయిరాజు, ఆర్టీజన్ ఎండీ మౌలానా, వినియోగదారులు రియాజ్, రవి పాల్గొన్నారు.

భూములకు పట్టాదారు పాస్ బుక్కులివ్వాలి

శంషాబాద్, జూన్ 28 : తమ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి రైతులందరికీ కొత్త పట్టాపాసుపుస్తకాలు ఇవ్వాలని శంషాబాద్ మున్సిపాలిటీ పరిధి కొత్వాల్‌గూడ రైతులు శుక్రవారం ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. రైతులు, గ్రామస్తులు మాట్లాడుతూ సుమారు 100 సంవత్సరాలుగా రైతులు కొత్వాల్‌గూడలో భూమి సాగుచేసుకొని జీవనం సాగిస్తున్నారన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి గత ప్రభుత్వం 38-ఈ కింద అన్ని హక్కులు కల్పించి పట్టాపాసుపుస్తకాలిచ్చిందని తెలిపారు. దీంతో రైతులు భూముల క్రయవిక్రయాలు జరిపే అవకాశం కలిగిందన్నారు. రైతుబంధు, బీమా, రుణమాఫీ పథకాలను సైతం పొందామన్నారు. ధరణి పోర్టల్‌లో మాత్రం కొత్వాగూడ రైతుల భూములను నిషేధిత జాబితాలో చేర్చారని తెలిపారు. అప్పటి నుంచి రైతులకు పథకాలు రావడం లేదన్నారు. నిషేధాన్ని ఎత్తివేసి రైతులకు కొత్త పట్టాపాసుపుస్తకాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కొత్వాల్‌గూడ మాజీ సర్పంచ్ పి.శ్రీనివాస్‌గౌడ్, ప్యాక్స్ వైస్‌చైర్మన్ జ్ఞానేశ్వర్, డైరెక్టర్ శ్రీనివాస్, రాజేష్‌గౌడ్, పలువురు రైతులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో విద్యార్థి నాయకులపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

ఇబ్రహీంపట్నం, జూన్ 28: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ నాయకుల సస్పెన్షన్, అలాగే అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు బి.వంశీ, తరంగ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో నిరసన తెలిపి వీసీ దిష్టిబొమ్మను దహనం చేశారు. హెచ్‌సీయూ విద్యార్థి సంఘం అధ్యక్షుడు అతిక్‌అహ్మద్, మరో 9 మంది విద్యార్థులను ఆరు నెలల పాటు సస్పెండ్ చేయడమేగాక 10వేల రూపాయల చొప్పున జరిమానా విధించారన్నారు. దీనిని వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. నిరసన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వినోద్, శివ, చందులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలు అమ్మితే కఠిన చర్యలు

షాబాద్, జూన్ 28: నిషేధిత మత్తుపదార్థాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని షాబాద్ ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపారు. శుక్రవారం షాబాద్, హైతాబాద్‌లో పాన్‌షాప్, కిరాణా షాప్‌లపై తనిఖీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... ఇండస్ట్రియల్ పరిధిలో ఉన్న హైతాబాద్ గ్రామంలో వివిధ ప్రాంతాలకు చెందిన ఉద్యోగులు అధిక మొత్తంలో పనిచేస్తున్నారని, ఇక్కడ మత్తు పదార్థాలు విక్రయంపై నిఘా పెట్టినట్లు తెలిపారు. ఎవరైనా నిషేధిత మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

రంగారెడ్డి జిల్లా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు ప్రారంభం

హైదరాబాద్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. తొలి రోజు... ఖాళీల వివరాలతోపాటు సీనియారిటీ జాబితాను ప్రకటించారు. మొత్తం ప్రక్రియ 8 రోజుల పాటు కొనసాగి జూలై 5న ముగియనుంది. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన అధికారులను ఆదేశించారు.

మురికి కూపంగా కూరగాయల మార్కెట్

- రోగాల భయంతో ప్రజల ఆందోళన

షాద్‌నగర్ రూరల్, జూన్ 28 : షాద్‌నగర్‌లోని ఈడెన్ గార్డెన్ వద్ద ఏర్పాటు చేసిన కూరగాయల మార్కెట్ మురికి కూపంగా మారింది. మార్కెట్‌కు పోతే రోగాలు వస్తాయేమోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పట్టణ కేంద్రంలో కూరగాయల మార్కెట్ ఇంత అధ్వానంగా ఉందని విచారం వ్యక్తం చేస్తున్నారు. కరోనా సమయంలో గంజ్ పక్కనున్న కూరగాయల మార్కెట్‌ను వారాంతాలుగా కాలనీలకు మార్చారు. హాజిపల్లి-పరిగి రోడ్డు మధ్యలో ఈడెన్ ప్లాజా-షాహీ గార్డెన్ వద్ద మార్కెట్ ఏర్పాటు చేశారు. ఇదే పెద్ద కూరగాయల మార్కెట్. కానీ అక్కడ మురుగుమయంగా మారింది. కొంత సీసీ రోడ్డు వేసినా దానిపై మట్టి చేరి వర్షం పడ్డప్పుడు బురదగా మారుతోంది. పరిగి రోడ్డు నుంచి హనుమాన్ ఆలయం సీసీ రోడ్డు పాడైపోయింది. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వర్షం కురిస్తే గోతుల్లో నీరు చేరి మడుగులు తయారవుతున్నాయి. కుళ్లిన కూరగాయలతో దుర్వాసన వస్తోంది. కొత్తగా సీసీ రోడ్డు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

అయ్యప్ప కాలనీ రోడ్డులో ఇలా

అయ్యప్ప కాలనీకి వెళ్లే రోడ్డులో మరో కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. అక్కడా మార్కెట్‌కు సౌకర్యవంతంగా లేదు. గతంలో రోడ్డుకు ఇరువైపుల ఉన్న దుకాణాలను తడకలతో ఏర్పాటు చేసుకున్నారు. వర్షం కురిస్తే విక్రయ, కొనుగోలు దారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నేళ్లుగా లక్ష్మీనర్సింహ కాలనీలో ఉన్న కూరగాయల మార్కెట్ ప్రజలకు సౌకర్యవంతంగా లేదు. సందులో ఉంది. వానకాలంలో బురదమయం అవుతోంది.

శాశ్వత కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేయాలి

కరోనా సమయంలో రెండు, మూడు మార్కెట్‌లుగా విభజించిన కూరగాయల మార్కెట్‌కు పూర్తిగా శాశ్వత మార్కెట్‌ను అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు. పదేళ్ల కింద పట్టణంలోని లక్ష్మీ నర్సింహ కాలనీలో నిర్మించిన మాంసం విక్రయశాల వృథాగా ఉంది. శాశ్వత మార్కెట్ ఏర్పాటుతో మాంసం విక్రయాలు ఒకేచోట జరిగేలా సదుపాయాలు కల్పించాలని


కూరగాయల దుకాణం ముందు నీటి గుంత



గిరాకీ రావడం లేదు

రోడ్డులో మురుగు నీరు చేరి దుర్వాసన వస్తోంది. ఈ మురుగులో కూరగాయలు కొనేందుకు ప్రజలు రావడం లేదు. మేం మార్కెట్ నుంచి తెచ్చిన కూరగాయలు కొనేవారు రాక మురుగుతున్నాయి. నీరు నిల్వ ఉండకుండా గుంతలను మట్టితో పూడ్చాలి.

- ఖదీర్, కూరగాయల వ్యాపారి

అటవీ రేంజ్‌ను పీడిస్తున్న సిబ్బంది కొరత

- నాలుగేళ్లుగా ఇన్‌చార్జి రేంజర్ కొనసాగింపు
- ఖాళీగా తొమ్మిది బీట్ అధికారుల పోస్టులు
- ఆక్రమణకు గురవుతున్న అడవి

ధారూరు, జూన్ 28: ధారూరు అటవీరేంజ్‌ను చాలాకాలంగా సిబ్బంది కొరత పట్టిపీడిస్తోంది. నాలుగేళ్లుగా రేంజర్ పోస్టు ఖాళీగా ఉండటంతో ఇన్‌చార్జి రేంజర్‌ను కొనసాగిస్తున్నారు. బీట్ అధికారులు పోస్టులూ ఖాళీగా ఉన్నాయి. దీంతో జిల్లాలోనే పెద్ద అడవిగా పేరున్న ధారూరు అడవి ఆక్రమణకు గురవుతోంది. ఏటా అటవీ ప్రాంతంలో విలువైన చెట్లను నరికి ఎకరాల కొద్దీ అటవీ భూమిని ఆక్రమించి ఆక్రమార్కులు సాగు చేసుకుంటున్నారు. రేంజ్‌లో సిబ్బంది కొరత పాటు, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవటం, అడవి ఆక్రమణను నిరోధించటానికి కఠిన నిర్ణయాలు తీసుకోవడానికి అటవీ అధికారులు జంకుతుండటంతో అడవి నాశనమవుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ధారూరు అటవీరేంజ్‌లో ధారూరు, కోట్‌పల్లి, యాలాల్, పెద్దేముల్ మండలాల పరిధిలో దాదాపు 20వేల ఎకరాల విస్తీర్ణంలో అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. రేంజ్‌లో నాలుగు సెక్షన్లు, 12బీట్‌లు ఉన్నాయి.


ధారూరు అటవీ రేంజ్ కార్యాలయం

నాలుగేళ్లుగా ఇన్‌చార్జి రేంజరే

ధారూరు అటవీరేంజ్ నాలుగేళ్లుగా ఇన్‌చార్జి రేంజర్‌తోనే కొనసాగిస్తున్నారు. ఇక్కడ రేంజర్‌గా పనిచేసిన వెంకటయ్యగౌడ్ 2020లో బదిలీపై వెళ్లిన తర్వాత రేంజ్‌కు ఇంత వరకు పూర్తి స్థాయి రేంజర్‌ను నియమించలేదు. ఈయన స్థానంలో ఇంచార్జి రేంజర్‌గా కొనసాగిన రేంజర్ కృష్ణ గత మార్చి 31న ఉద్యోగ విరమణ చేయటంతో వికారాబాద్ రేంజ్ రేంజర్ అరుణకు ధారూరు రేంజ్ రేంజర్‌గా ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. ఇన్‌చార్జి రేంజర్ అప్పుడప్పుడు వచ్చి వెళ్తుండగా డీఎఫ్ఆర్‌వో, సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు అటవీ సంరక్షణ బాధ్యతలను నిర్వహిస్తున్నారు. కాగా రేంజ్‌లోని 12బీట్లకు ముగ్గురు బీట్ అధికారులే విధులు నిర్వహిస్తుండగా, తొమ్మిది మంది బీట్ అధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ ముగ్గురిలో ఒకరికి గురుకుల కళాశాల లెక్చరర్ పోస్టు రావటంతో మరో బీట్ అధికారి పోస్టు త్వరలో ఖాళీకానుంది. బీట్ అధికారుల నియామకాలు జరగకపోవటంతో ఏళ్ల తరబడి ఈ పోస్టులు ఖాళీగానే ఉంటున్నాయి. దీంతో ఉన్న బీట్ అధికారులపై పనిభారం పెరిగి మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారు. క్షేత్రస్థాయిలో అడవిని సంరక్షించే బీట్ అధికారులే లేకపోవడంతో అటవీ ప్రాంతం నరికివేతకు గురవుతోంది.

ఆక్రమణకు గురవుతున్న అడవి

ధారూరు రేంజ్‌లో సరైన సిబ్బంది లేకపోవడంతో ఆక్రమార్కులు అడవిని ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారు. ఏటా అడవి నరికివేతకు గురై పెద్దపెద్ద విలువైన చెట్లు నేలమట్టమవుతున్నాయి. రాస్నం సెక్షన్‌లో అడవి ఎక్కువగా ఆక్రమణకు గురవుతున్నా అధికారులు అడ్డుకోలేకపోతున్నారు. అడవులు నాశనమవుతుండటంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లి వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అటవీశాఖ ఉన్నతాధికారులు స్పందించి అటవీ రేంజ్‌లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి అడవిని కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.


దోర్నాల్ అడవిలో నరికిన చెట్లు(ఫైల్)

తెలంగాణలో టీడీపీకి పూర్వ వైభవం

- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు

షాద్‌నగర్ అర్బన్, జూన్ 28 : తెలంగాణలో టీడీపీకి పూర్వ వైభవం వస్తుందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని లింగారెడ్డిగూడలో శుక్రవారం టీడీపీ జెండా పం డుగ నిర్వహించారు. బక్కని నర్సింహులు జెం డాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ఏపీలో అరాచక పాలనను అంతం చేసి, టీడీపీ అఖండ విజయం సాధించడంతో తెలంగాణాలోని తెలుగు తమ్ముళ్లలో నూతనోత్సాహం నెలకొందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామంలో టీడీపీ జెండా పండుగ ప్రారంభమైనాయని తెలిపారు. వచ్చే నాలుగున్నరేళ్లలో అధికారమే లక్ష్యంగా పార్టీని బలోపేతం చేస్తామన్నారు. 2014 ఎన్నికల్లో గెలిచిన 15 మంది టీడీపీ ఎమ్మెల్యేలను, 2019లో గెల్చిన ఇద్దరు టీడీపీ ఎమ్మెల్యేలను టీఆర్ఎస్‌లో చేర్చుకున్న మాజీముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పుడు పార్టీ ఫిరాయింపులపై మాట్లాడడం హాస్యాస్పదం అన్నారు. తాను ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకుంటే తప్పులేనిది, ఇప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఇతర పార్టీలోకి వెళ్తే తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించింది కేసీఆరే అన్నారు. అధికారం ఉందని అడ్డగోలుగా వ్యవహరిస్తే ప్రజలు గుణపాఠం చెప్పారని రెండు రాష్ట్రాల్లో నిరూపితమైందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చల్లా వెంకటేశ్వర్ రెడ్డి, కుమార్‌గౌడ్, వెంకటయ్యగౌడ్, ఆనంద్, అంజయ్యగౌడ్, భాస్కర్‌రెడ్డి, నర్సింహులు, కృష్ణయ్య, భూపతిరెడ్డి, బాబునాయక్ పాల్గొన్నారు.


జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు

గంధోత్సవాలను విజయవంతం చేయాలి

ఆమనగల్లు, జూన్ 28 : హైదరాబాద్ పురాణపూల్‌లో జూలై 1న 4వ ఉర్సు గంధోత్సవాన్ని నిర్వహిస్తామని ఆమనగల్లు మహ్మదీయ మజీద్ అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ ఖాద్రీ, నయాబ్ సదర్ మహ్మద్ అబ్దుల్ ఖాద ర్ తెలిపారు. గంధోత్సవంలో ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఆమనగల్లు శుక్రవారం వేడుకలపై సన్నాహక సమావేశం నిర్వహించిన కరపత్రాలు, వాల్‌పోస్టర్లను ఖాదర్‌ఖాద్రీ ఆవిష్కరించారు.

నీట్ రాసిన విద్యార్థులకు న్యాయం చేయాలి

మేడ్చల్ టౌన్, జూన్ 28 : నీట్ పరీక్ష రాసిన 24లక్షల మంది విద్యార్థులకు న్యాయం జరిగేంత వరకు ప్రజాప్రతినిధుల ఇళ్లను ముట్టడిస్తామని యువజన విద్యార్థి సంఘాల ఐక్యకార్యాచరణ సమితి డిమాండ్ చేసింది. శుక్రవారం విద్యార్థి సంఘాల నాయకులు మేడ్చల్ మండలం పూడూరు గ్రామ శివారులోని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ఇంటి ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థి సంఘం నేతలు మాట్లాడుతూ...నీట్ పరీక్ష రాసి నష్ట పోయిన తెలుగు రాష్ట్రాల విద్యార్థుల గురించి కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించని బీజేపీ ఎంపీలను తిరగనివ్వమని హెచ్చరించారు. ఎన్నో ఆశలతో నీట్ పరీక్షకు ప్రిపేయిర్ అయిన లక్షలాది మంది విద్యార్థులను మోసం చేసే విధంగా నీట్ పరీక్షలు నిర్వహించారన్నారు. కేవలం కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా నీట్ విద్యార్థులు నష్టపోయారన్నారు. విద్యార్థులకు న్యాయం జరిగేంత వరకు విద్యార్థి సంఘాల నాయకులు వారికి అండగా నిలిచి పోరాడుతామని తెలిపారు. కేంద్రం ప్రభుత్వం దిగి వచ్చి విద్యార్థులకు న్యాయం చేసేంత వరకూ తమ ఉద్య మాన్ని ఆపే ప్రసక్తి లేదన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఏఐఎఫ్ కార్యదర్శి టి.సత్య ప్రసాద్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్ యాదవ్, ఏఐఎఫ్ఎస్ జిల్లా నాయకుడు మహేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ ఈటల రాజేందర్ ఇంటి ఎదుట నిరసన చేపడుతున్న విద్యార్థి సంఘాల నేతలు

రాంగ్‌నెంబర్‌తో పరిచయమై బాలికకు వేధింపులు

- నిందితుడు నెల్లూరి వాసిగా గుర్తింపు
- పోక్సో కేసు నమోదు, రిమాండ్ తరలింపు

తాండూరు రూరల్, జూన్ 28: రాంగ్‌నెంబర్‌తో పరిచయమైన ఓ యువకుడు బాలికను వేధింపులకు గురి చేసి చివరకు జైలుపాలయ్యాడు. కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన పథనం ప్రకారం.. తాండూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(17) కొన్ని నెలల కిందట తన ఫోన్‌తో స్నేహితురాలికి ఫోన్ చేయబోయి ఏపీలోని నెల్లూరు జిల్లాకు చెందిన శ్రీనివాస్‌కు ఫోన్ చేసింది. ఆ రాంగ్‌నెంబర్ ఆధారంగా శ్రీనివాస్ మైనర్ బాలికతో స్నేహం పెంచుకున్నాడు. వాట్సాప్‌లో చాటింగ్, ఇన్‌స్టాగ్రామ్‌లో మెస్సేజ్‌లతో వారిమధ్య మాటలు కలిశాయి. ఫోన్‌లో ఆ బాలికను శ్రీనివాస్ అసభ్యకరమైన మాటలతో హింసించడం మొదలుపెట్టాడు. దీంతో విషయాన్ని బాలిక తన తల్లిదండ్రులతో తెలపడంతో వారు కరన్‌కోట్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు సదరు యువకుడి ఫోన్‌నెంబర్ ఆధారంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరుకు చెందిన శ్రీనివాస్‌గా గుర్తించారు. అతన్ని శుక్రవారం కరన్‌కోట్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.


నిందితుడు శ్రీనివాస్‌ను మీడియా ఎదుట ప్రవేశపెట్టిన పోలీసులు

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

నందిగామ, జూన్ 28: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం పనిచేస్తోందని, ఇప్పటికే హామీలను నెరవేర్చుతున్నామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం నందిగామలో కోటి రూపాయలతో నిర్మిస్తున్న ఎంపీడీవో కార్యాలయానికి, డ్వా క్రా భవనానికి ఎమ్మె ల్యే, జడ్పీ చైర్‌పర్సన్ అనితారె డ్డి, వైస్‌చైర్మన్ గణేష్ శంకుస్థాపన చేశారు.మండల కేంద్రంలో నిర్మించిన పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. అనంతరం అంతిరెడ్డిగూడలో మహిళా సమాఖ్య భవనం, అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించి పంచాయతీ కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నర్సప్పగూడలో జడ్పీ నిధులు 20లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను వారు ప్రారంభించారు. చేగుర్‌లో ఎంపీపీ నిధులతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్లను ప్రార ంభించారు. అనంతరం సమావేశంలో ఎమ్మెల్యే, జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ గ్రామాల్లో వసతుల కల్పించేందుకు కృషిచేస్తామన్నారు. రాజకీయాలకు అతీతంగా మండలాన్ని అన్ని రంగా ల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మె ల్యే అన్నారు. మాజీ ప్రధాని పీవీ. నర్సింహారావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నా యకులు నివాళులు అర్పించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ రాజేశ్వర్, ఎంపీడీవో సుమతి, ఎంపీపీ ప్రియాంకశివశంకర్‌గౌడ్, వైస్‌ఎంపీపీ మంజుల, ఎంపీటీసీలు కొమ్ము కృష్ణ, దేపల్లి కుమార్, చంద్రపాల్ రెడ్డి, రాజునాయక్, లత శ్రీశైలం, ఎంకిర్యాల కళమ్మ, కాంగ్రెస్ నాయకులు నర్సింలు, శివశంకర్‌గౌడ్, జిల్లెల్ల బాల్‌రెడ్డి, జిల్లెల్ల రాంరెడ్డి, తుమ్మల నర్సింలు, లింగం, జం గయ్యగౌడ్, కృష్ణాగౌడ్, సాములయ్య, బుచ్చ య్య, శ్రీశైలం, రాజశేఖర్ పాల్గొన్నారు.


మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, తదితరులు

మెరుగైన వసతులు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయం

కడ్తాల్, జూన్ 28: ప్రజలకు మెరుగైన వసతుల కల్పించడమే కాంగ్రెస్ ప్రజాపాలన ధ్యేయం అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం కార్యాచరణ రూపొందించి అమలు చేస్తోందని పేర్కొన్నారు. కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ ఆలయ సమీపంలో రూ.15లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణం పనులకు శుక్రవారం ఎంపీపీ కమ్లీమోత్యనాయక్, జడ్పీటీసీ దశరథ్‌నాయక్, స్థానిక మాజీ సర్పంచ్ తులసీరామ్‌నాయక్, ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారిని నాలుగు లేన్ల విస్తరణకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారని, కేంద్రం సానుకూలంగా స్పందించిందని చెప్పారు. నియోజకవర్గంలోని మారుమూల గ్రామాలు, తండాలకు వచ్చే ఏడాది లోపు బీటీ రోడ్లు నిర్మిస్తామని పేర్కొన్నారు. గ్రామాల్లో మిగిలిపోయిన అంతర్గత రోడ్లను సీసీగా మార్చి కొత్త కాలనీల్లో డ్రైయిన్ల నిర్మాణం చేపడుతామని చెప్పారు. మైసిగండి ఆలయం వద్ద భక్తులకు వసతులు కల్పించి ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కేఎల్ఐ డీ-82 కాల్వ అసంపూర్తి పనులు త్వరితగతిన పూర్తిచేయించి ఆమనగల్లు, వెల్దండ, మాడ్గుల మండలాల్లో 35వేల ఎకరాలకు సాగునీరందిస్తామన్నారు. కాల్వ నిర్మాణంతో భూములు కోల్పోయిన నిర్వాసిత రైతులకు రావాల్సిన పరిహారం త్వరగా చెల్లించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరగా మంజూరుకు అధికారులకు ఆదేశించారని కసిరెడ్డి చెప్పారు. అంతకు ముందు మైసిగండి మైసమ్మ ఆలయంలో తన సతీమణి మాధవిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే పూజలు నిర్వహించారు. ఆలయ మర్యాదలతో కసిరెడ్డిని సత్కరించి ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కడ్తాలలో నిర్మాణం పూర్తైన కేజీబీవీ భవనాన్ని ప్రారంభించి విద్యార్థుల ఇబ్బందులు తీర్చాలని జడ్పీటీసీ దశరథ్‌నాయక్ స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కోరారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, నాయకులు గూడూరు భాస్కర్ రెడ్డి, నరేశ్ నాయక్, పాండునాయక్, గురిగళ్ల లక్ష్మయ్యరాం చందర్ నాయక్, సత్యం యాదవ్, బాచిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, జవహర్‌లాల్ నాయక్, తులసీరామ్ నాయక్, పంత్యానాయక్, డీఈ శ్రీనివాస్, ఏఈ పరమేశ్, సీఐ శివప్రసాద్, ఎంపీడీవో సుజాత, పంచాయతీ కార్యదర్శి సత్యం, మైసిగండి స్పెషలాఫీసర్ శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.


సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

కష్టపడి చదివితేనే విజయం



జ్యోతి ప్రజ్వలన చేసి హ్యాకథాన్‌ను ప్రారంభిస్తున్న మనీష్

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 28: కష్టపడి చదివితేనే విజయం సాధించగలమని ఇన్ఫోసిస్ సంస్థ సలహాదారు మనీష్ అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో శుక్రవారం నిర్వహించిన జాతీయస్థాయి హ్యాకథాన్‌ను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విజయాలు ఊరికే రావని, ఎంతో కష్టపడి చదివితేనే విజయం సాధించగలమన్నారు. విజయానికి ఎలాంటి షార్ట్‌కట్‌లు ఉండవని గుర్తుచేశారు. పట్టుదల, శ్రమ, ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగితేనే విజయం వరిస్తుందన్నారు. జాతీయస్థాయి హ్యాకథాన్లలో పాల్గొని నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. 36గంటల పాటు సాగే ఈ హ్యాకథాన్‌లో దేశవ్యాప్తంగా దాదాపు 500మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ఈ హ్యాకథాన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి రూ.లక్షా 50వేల నగదు బహుమతిని అందజేయనున్నట్లు అనురాగ్ యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ హెచ్‌వోడీ విష్ణుమూర్తి తెలిపారు. ఈకార్యక్రమంలో హెచ్‌వోడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

బొగ్గు గనుల వేలాన్ని నిలిపివేయాలి



పరిగిలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

పరిగి, జూన్ 28: మంచిర్యాల్ జిల్లా శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌లను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వేలంలో ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టడాన్ని నిలిపివేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం పరిగి బస్టాండ్ దగ్గర నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య మాట్లాడుతూ.. సింగరేణి ద్వారానే తవ్వకాలు జరపాలని, ప్రైవేట్ సంస్థలకు అప్పగించరాదని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేయడమే లక్ష్యంగా పనిచేస్తోందని మండిపడ్డారు. బొగ్గు గనుల వేలాన్ని నిలిపివేయాలని లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బస్సు చంద్రయ్య, కె.చంద్రయ్య, గోవింద్‌నాయక్, హబీబ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అసదుద్దీన్ ఒవైసీపై కేసు నమోదు చేయాలి



ఫిర్యాదు చేస్తున్న నాయకులు

పూడూరు, జూన్ 28: ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీపై కేసు నమోదు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు రాఘవేందర్, ఫిలింసెన్సార్ బోర్డు మెంబర్ ఎం.మల్లేష్ పటేల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పార్లమెంట్‌లో శుక్రవారం ప్రమాణస్వీకారం అనంతరం ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ జైపాలస్తీనా అంటూ నినాదాలు చేశారని తెలిపారు. దీనికి గానూ ఒవైసీ లోక్‌సభ స్థానం నుంచి ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయాలని, అదేవిధంగా తనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చెన్‌గోముల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తక్షణమే ఒవైసీపై కేసు నమోదు చేయాలని, పీడీయాక్ట్ పెట్టాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో నాయకులు కె.సత్యనాయక్, సుభనయ్య, విఠల్, మసద్ తదితరులు ఉన్నారు.

క్యాన్సర్‌ను గుర్తిస్తే నయం చేయొచ్చు



కేరెల్లిలో ఏర్పాటు చేసిన క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

ధారూరు, జూన్ 28: ముందస్తు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను చేయించుకోవడం ద్వారా క్యాన్సర్‌ను గుర్తించి నయం చేయొచ్చని శ్రీ సత్యసాయి సేవా సంస్థల మెడికల్ విభాగం రాష్ట్ర సమన్వయ కర్త భాస్కర్‌రావు తెలిపారు. మండలంలోని కేరెల్లి గ్రామంలో శుక్రవారం శ్రీ సత్యసాయి సేవా సంస్థలు(మహిళ విభాగం) ఆధ్వర్యంలో, హైదరాబాద్ ఎంఎన్‌జే ఆస్పత్రి వారి సహకారంతో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. మహిళా విభాగం ద్వారా 18 జిల్లాలో 36 శిబిరాలను నిర్వహించి వివిధ రకాల పరీక్షలతో క్యాన్సర్ రోగులను గుర్తించి చికిత్స అందించామని ఆయన చెప్పారు. కాగా ఈ శిబిరంలో 81మంది క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ సమన్వయకర్త మాధవీలత, సత్యసాయి సేవా సంస్థల బాధ్యులు జగదీశ్వర్ సింగ్ ఠాకూర్, వీరేశం గౌడ్, అనంత్ రెడ్డి, ప్రేమ్‌కుమార్, రాజేందర్ రెడ్డి, సిద్దమ్మ, మాజీ సర్పంచు నర్సింహారెడ్డి, ఎంఎన్‌జే అంకాలజీ వైద్యులు డాక్టర్ సీఎస్ ప్రసాద్, వీనీల, స్వప్న, పారామెడికల్ సిబ్బంది , సేవాదల్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

మహిళా పొదుపు సంఘంలో అవకతవకలపై విచారణ జరిపించాలి

కీసర, జూన్ 28: మహిళా పొదుపు సంఘంలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని జడ్పీ వైఎస్ చైర్మన్ పూస వెంకటేష్ అన్నారు. కీసర మండల కేంద్రంలోని స్నేహ మహిళా పొదుపు సంఘం సర్వసభ్య సమావేశానికి శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పొదుపు సంఘం నుంచి రుణం తీసుకున్న సకాలంలో చెల్లించడం లేదన్నారు. పొదుపు సంఘం అనేక అవకతవకలు జరిగాయని వీటిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మహిళలు రుణాలు తీసుకొని తిరిగి చెల్లిస్తుంటే కొంతమంది మాత్రం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ సకాలంలో రుణాలు చెల్లించడంలేదన్నారు. వీరిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్నేహ మహిళ పొదుపు సంఘం అధ్యక్షురాలు పండగ స్వప్న, ఎండీ ఫర్జానా, డైరెక్టర్లు పద్మ, జగదాంబ, వీరమణి, పద్మ, మహిళలు పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధితో రాణించాలి

కులకచర్ల, జూన్ 28: యువత స్వయం ఉపాధితో రాణించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రహ్లాద్‌రావు అన్నారు. కులకచర్లలో నూతన వస్త్రాలయంను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉద్యోగాల కోసం ఎదురుచూసే కంటే స్వయంశక్తితో ఉపాధి పొందాలని తెలిపారు. అనుభవంతో ముందుకెళ్తే ఏ వ్యాపారంలో అయినా రాణించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు సౌమ్యరెడ్డి, జానకిరామ్, బీజేపీ జిల్లా నాయకులు అంజిలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి సమాజానికి ఆదర్శం



బండవెల్కిచర్లలో ఉపాధ్యాయుడు పరందాములును సన్మానిస్తున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

కులకచర్ల, జూన్ 28: ఉపాధ్యాయ వృత్తి సమాజానికి ఆదర్శమని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. కులకచర్ల మండలంలోని బండవెల్కిచర్ల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు పరందాములు ఉద్యోగ విరమణ అభినందనసభను శుక్రవారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా పరందాములును సన్మానించి ఎమ్మెల్యే మాట్లాడారు. పరందాములును తోటి ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువుకు ఉంటుందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని, అందులో భాగం గా పదోన్నతులు, బదిలీలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రతీ మండల కేంద్రంలో విద్యా ప్రమాణాలతో కూడిన సామూహిక విద్యాలయాలు ప్రభుత్వం నిర్మిచనుందన్నారు. పాఠశాలల్లో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే నిధులు కేటాయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రహ్లాద్‌రావు, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, ఎంఈవో హబీబ్ అహ్మద్, పీఆర్టీయూ పత్రిక సంపాదకులు ఇన్నరెడ్డి, పాఠశాల హెచ్‌ఎం శరత్‌కృష్ణ, ఏపీసీ చైర్మన్ ఆలవేలు, పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, బస్వరాజు, గౌరవ అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, నాయకులు పెంటయ్య, నర్సింహులుగౌడ్, తెలుగు ఉపన్యాసకులు భాస్కరయోగి, పీఆర్టీయూ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం



ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్‌ను సన్మానిస్తున్న ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు

కొడంగల్, జూన్ 28: ప్రజాసమస్యలపై చర్చించేందుకు ప్రతీ మూడు నెలలకోసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ముద్దప్పదేశ్ ముఖ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వచ్చే నెల 4వ తేదీతో తన పదవీ కాలం ముగుస్తుందని 5 సంవత్సరాల పాటు సహకరించిన ఎంపీటీసీలు, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ, ఎంపీటీలను అధికారులు పూలమాలలు, శాలువాతో సన్మానించారు. అంతకు ముందు జరిగిన సమీక్షలో వివిధ శాఖల అధికారులు మాట్లాడుతూ సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్ కావడంతో అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయని పనుల ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎంఈవో రాంరెడ్డి మాట్లాడుతూ.. తన 34 సంవత్సరాల సర్వీసు కాలంలో ఏ ప్రభుత్వం ఇంత పెద్దఎత్తున పాఠశాలలకు నిధులు కేటాయించలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం పాఠశాలల రూపురేఖలను మారుస్తుందన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఉషశ్రీ, వివిధ శాఖల అధికారులు, వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో తైబజార్ వేలం



కొడంగల్‌లో తైబజార్ వేలం నిర్వహిస్తున్న అధికారులు



బొంరాస్‌పేట్: తైబజార్ వేలం నిర్వహిస్తున్న అధికారులు

కొడంగల్, జూన్ 28: కొడంగల్ మున్సిపాలిటీలో శుక్రవారం తైబజార్ వేలం నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, కమిషనర్ బలరాంనాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో కొడంగల్ పట్టణానికి చెందిన సయ్యద్ నాసిర్‌హుసేన్ రూ.4 లక్షల 97వేలకు దక్కించుకున్నాడు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: మండల కేంద్రంలో ప్రతీ ఆదివారం నిర్వహించే వారంతపు కూరగాయల సంత 2024-25 సంవత్సరానికి గాను శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన రవిగౌడ్ అత్యధికంగా రూ.39వేలకు వేలంపాడి దక్కించుకున్నాడు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి మహేశ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ రవి, కార్యదర్శులు వెంకటయ్య, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

జూలై 1న షెట్టర్లు, తైబజార్ వేలం

పెద్దేముల్: పెద్దేముల్‌లో జూలై 1వ తేదీన తైబజార్ వేలం నిర్వహించనున్నట్లు స్పెషల్ ఆఫీసర్ అఖిల్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో గల 9షెట్టర్లు, తైబజార్, వాటర్‌ఫిల్టర్‌కు సంబంధించి వేలం వేయనున్నట్లు తెలిపారు. అయితే వాటిని 31-3-2025వరకు మాత్రమే అద్దె ప్రాతిపాదికన వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలం ఉదయం 10.30 గంటల నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. వేలంలో పాల్గొనేవారికి గ్రామపంచాయతీకి ఇంటిపన్ను, నల్లాపన్ను మొదలగు వాటి బకాయిలు ఉండకూడదని అన్నారు. ఉదయం 8.30 గంటల నుండి 10గంటల లోపు ఒక్కొక్క వేలానికి రూ.1500 చొప్పున డిపాజిట్ చెల్లించి రశీదు పొందాలని తెలిపారు. సమయం దాటిన తరువాత వచ్చిన వారినుంచి డిపాజిట్ తీసుకోబడదని స్పష్టం చేశారు. ఉదయం 10.30 నుంచి 11.30వరకు తైబజార్, 11.30 నుంచి 12.30 వరకు షెట్టర్లు, 12.30 నుంచి వాటర్ ఫిల్టర్ వేలం నిర్వహించనున్నట్లు వివరించారు. వేలం దక్కించుకున్న వారు అదే రోజు మిగతా డబ్బులను చెల్లించి రశీదు పొందాలని తెలిపారు. ప్రతీ వేలానికి అప్లికేషన్ ఫీజు రూ.500 ఉంటుందని, అవి ఎవరికీ తిరిగి ఇవ్వబడవని పేర్కొన్నారు.

కులకచర్ల: కులకచర్ల గ్రామ తైబజార్ వేలంను శనివారం నిర్వహించనున్నట్లు గ్రామ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ మురళీధర్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తైబజార్ వేలంలో పాల్గొనే వారు ముందుగా రూ.50వేలు చెల్లించాలన్నారు. ఉదయం 9.30గంటలకు తైబజార్ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి



గుండ్లపోచంపల్లి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

మేడ్చల్ టౌన్, జూన్ 28: వర్షాకాలం దృష్ట్యా అంటువ్యాధులు ప్రబలకుండా మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో పారిశుధ్యం పట్ల ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మి అన్నారు. శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులపై కౌన్సిల్ ఆమోదం తెలిపింది. కాగా వార్షాకాలంలో అంటు వ్యాధులు ప్రభల కుండా ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని కౌన్సిల్ తీర్మానించింది. పరిసరాల్లో మురుగు నీరు నిలవకుండా, కాలనీల్లో చెత్తాచెదారం లేకుండా, వర్షపునీరు కాలనీల పరిసరాల్లో నిలవకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. దోమలను నివారించటానికి ప్రత్యేకంగా వీధుల్లో దోమల మందును స్ప్రే చేయించాలని సూచించారు. అదే విదంగా ఆషాడ బోనాలు ప్రారంభం కానుండటంతో మున్సిపల్ పరిధిలోని అమ్మవార్ల ఆలయాల వద్ద పారిశుధ్యం పట్ల ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. బోనాల ఉత్సవాలు ముగిసేంత వరకు మున్సిపల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా మున్సిపల్ తరపున చేపట్టాల్సిన చర్యలపై సభ్యులు సలహాలు, సూచనలు ఇవ్వాలని సూచించారు. వర్షాకాలం ముగిసేంతవరకు మున్సిపల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ రాములు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

● **దోమ:** మండల కేంద్రంలో శుక్రవారం పాల ఉత్పత్తి దారుల సహకార సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు ఆంగోత్ చంద్ర్యనాయక్, ఎప్పటూరి మల్లేశ్ గెలుపొందారు. గెలుపొందిన డైరెక్టర్‌లతో చైర్మన్‌ను ఎన్నుకోవాల్సి ఉంటుందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఎన్నికలో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు ఇప్పటూరి మల్లేశం, ఆంగోత్ చంద్ర్యనాయక్‌లు గెలుపొందారు. వీరిని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి శాలువాలతో సన్మానించారు.

● **తాండూరు రూరల్:** మండలం పరిధి లోని ఆయా గ్రామాల్లో అమ్మ ఆదరణ పథకం కింద పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని తాండూరు ఎంపీడీవో విశ్వప్రసాద్ అన్నారు. అంతారం ప్రాథమికోన్నత పాఠశాలలో కొనసాగుతున్న అమ్మ ఆదరణ పనులను శుక్రవారం పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ఇస్మాయిల్, టెక్నికల్ అసిస్టెంట్ మల్లికార్జున్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

● **మేడ్చల్ టౌన్:** పూడూరులో నిర్మిస్తున్న శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయ నిర్మాణానికి స్థానిక ఓంసాయి ఫంక్షన్ హాల్ తరపున గుడి నిర్మిస్తున్న వెంకటరాంరెడ్డికి రూ.51వేల చెక్కును శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో శేషు కుమార్ సాకేత్‌రెడ్డి, చిన్న యాదవ్, తుపాకుల మల్లికార్జున్, గోపాల్ పాల్గొన్నారు.

● **బషీరాబాద్:** సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బషీరాబాద్ హెడ్‌కానిస్టేబుళ్ల లోక్యానాయక్, రాఘవులు తెలిపారు. మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ వద్ద శుక్రవారం ప్రజలు, వాహనదారులతో సమావేశమై అవగాహన కల్పించారు. ముఖ్యంగా అపరిచిత వ్యక్తులు ఫోన్‌చేసి తమ బ్యాంక్ ఖాతాల వివరాలు, ఓటీపీ నెంబర్లు అడిగితే ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వరాదన్నారు. ఎవరైనా అలా ఫోన్ చేస్తే 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. నెంబర్‌ప్లేట్లు లేకుండా వహనాలు రోడ్లపై తిరిగితే జప్తు చేస్తామని వెల్లడించారు.

● **తాండూరు రూరల్:** మండలంలోని బెల్కటూర్ క్లస్టర్ పరిధిలోని రైతులు తమ పంటల వివరాలను నమోదు చేసుకోవాలని ఏఈవో శ్రీనివాస్ అన్నారు. తాండూరు మండలం బెల్కటూర్ క్లస్టర్ పరిధిలోని బెల్కటూర్, చిట్టిఘనాపూర్ గ్రామాల్లో శుక్రవారం రైతుల పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ రైతులు ప్రస్తుతం వేసిన ఖరీఫ్ పంటల వివరాలను తమకు అందజేయాలన్నారు. ఆయన వెంట రైతులున్నారు.

● **దోమ:** మండలంలోని అయినాపూర్ చెరువు కట్టపై మండల పరిషత్ నిధులు రూ.లక్షతో ఎంపీటీసీ విజయ ఆంజనేయులు ఆధ్వర్యంలో శుక్రవారం బోరు మోటార్‌ను ప్రారంభించారు.

● **పరిగి/దోమ:** అంకిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పరిగిలోని బాలికల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు, దోమ మండలంలోని బాసుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా బ్యాగ్‌లు, చెప్పులు, మ్యాట్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ చంద్రమోహన్, హెచ్‌ఎం కనకచారి, అంకిత సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ ప్రకాశ్, ఎమ్మార్సీ శ్రీశైలం, ఉపాధ్యాయులు నవీన్, శ్రీశైలంలు, సీనియర్ జర్నలిస్టు కె.అంజనేయులు, టీచర్లు ఖదీర్, సునీత, ఎమ్మార్సీ సావిత్రి పాల్గొన్నారు.

కళాశాలల్లో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

శామీర్‌పేట, జూన్ 28: శామీర్‌పేటలోని జగద్గిరిగుట్ట ప్రభుత్వ గురుకుల డిగ్రీ మహిళా కళాశాలల్లో డిగ్రీ కోర్సుల్లో చేరేందుకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఇష్రత్ తెలిపారు. శామీర్‌పేటలోని గురుకుల కళాశాల్లో ప్రస్తుత అకాడమిక్ ఇయర్‌లో డిగ్రీలో బికాం బీఏ, బికాం సీఏ, ఎంపీసీ, ఎంఎస్ సీఎస్, ఎంజడ్సీ, బీజడ్సీ, ఎంఎస్ డీసీఎస్, బీఎస్సీ(హనర్స్) కోర్సుల్లో అర్హులైన విద్యార్థులు చేరేందుకై దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈడిగ్రీ కోర్సుల్లో చేరేందుకు ఇంటర్ ఉత్తీర్ణులై ఎస్సీ సమాజికవర్గానికి చెందిన విద్యార్థినులు నేరుగా కళాశాలకు వచ్చి దరఖాస్తులను సమర్పించి అడ్మిషన్లను పొందవచ్చని ప్రిన్సిపాల్ తెలిపారు.

బండి సంజయ్‌ను కలిసిన కీసర నాయకులు



కీసర, జూన్ 28: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను శుక్రవారం కీసర బీజేపీ నాయకులు ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. బండి సంజయ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కీసర మండల ప్రధానకార్యదర్శి కోల బాల్‌రాజ్‌యాదవ్, జిల్లా యువమోర్చా ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, రాజుగౌడ్, సదానందరెడ్డిలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ప్రమాదవశాత్తు నీటిగుంతలో పడి చిన్నారి మృతి


మూడుచింతలపల్లి, జూన్ 28: ప్రమాదవశాత్తు నీటిగుంతలో పడి చిన్నారి మృతి చెందాడు. ఈఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. కొన్ని నెలల కిందట మధ్యప్రదేశ్‌కు చెందిన భార్యాభర్తలు బతుకుదెరువు కోసం తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లోని నర్సరీలో విధులు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి రెండు సంవత్సరాల కొడుకు కాన ఉన్నాడు. రోజువారీలాగే నర్సరీలో విధులు నిర్వహిస్తున్న సమయంలో కాన ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న నీటి గుంతలో పడి మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

● బంగారు అభరణాలతో పాటు నగదు అపహరణ

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 28: తాళం వేసిన ఇంట్లో బంగారు ఆభరణాలతో పాటు నగదును అపహరించుకెళ్లిన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధి ఎన్‌ఎఫ్‌సీ నగర్‌లో చోటుచేసుకుంది. సీఐ సైదులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎన్‌ఎఫ్‌సీనగర్‌లో నివాసముంటున్న నితీష్‌కుమార్ శ్రీవాస్తవ్(35) సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఈనెల 7వ తేదీన ఇంటికి తాళంవేసి నగరంలోని మియాపూర్‌లోని తన అద్దె ఇంటికి వెళ్లాడు. అతడి సోదరుడు యూపీకి వెళ్లాడు. నితీష్‌కుమార్ శ్రీవాస్తవ్ తిరిగి ఈనెల 28న ఉదయం ఇంటికి వచ్చి చూడగా గేట్ మేయిన్‌డోర్ తాళం పగులగొట్టి ఉండటంతో లోపలికి వెళ్లి బెడ్‌రూంలోని బీరువాను చూడగా అందులోని వస్తువులన్నీ చిందరవందరగా పడిఉన్నాయి. బీరువాలోని బంగారు నల్లపూసల దండ, రెండు బంగారు నాణేలు, బంగారం ఉంగరం, వెండి అభరణాలు కనిపించలేదు. దీంతో పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనాస్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళం పగులగొట్టి బంగారు అభరణాలతో నగదును అపహరించుకెళ్లినట్లు నిర్ధారించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గంజాయి పట్టివేత



గంజాయి తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు

మూడుచింతలపల్లి, జూన్ 28: పనసకాయల వాహనంలో గంజాయిని తరలిస్తున్న వాహనాన్ని ఎస్‌వోటీ పోలీసులు, శామీర్‌పేట్ పోలీసులతో సంయుక్తంగా దాడిచేసి చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ ఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఏపీ నుంచి తెలంగాణలోని కరీంనగర్ వైపు గంజాయిని తరలిస్తున్న ఏపీ 39 యుయాయూ 4550 నంబరు గల బొలెరో వాహనాన్ని శామీర్‌పేట్ ఓఆర్ఆర్ టోల్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. పనసకాయల లోడ్ వాహనంలో గంజాయిని తరలిస్తున్న నిందితులు ఇద్దరితో పాటు వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఆర్టీసీ మనుగడకు ఉద్యోగులే మూలస్తంభాలు



ఉత్తమ ఉద్యోగులకు సన్మాన కార్యక్రమంలో డీఎం కరుణశ్రీ

పరిగి,జూన్ 28: ఆర్టీసీ సంస్థకు డ్రైవర్, కండక్టర్లే మూల స్తంభాల్లాంటివారని పరిగి ఆర్టీసీ డిపో మేనేజర్ కరుణశ్రీ అన్నారు. ఆర్టీసీ ఉత్తమ ఉద్యోగులకు, వారి పిల్లలకు క్విజ్ పోటీల సందర్భంగా శుక్రవారం అభినందన సభను నిర్వహించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సోంమ్లా, కార్గో సూపర్‌వైజర్ విశ్వనాథ్‌గౌడ్, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ దేవతకు బోనాలు



కొడంగల్ పెద్ద చెరువు కట్టపై ఎల్లమ్మ దేవతకు బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

కొడంగల్ రూరల్, జూన్ 28: ఎల్లమ్మ తల్లి వర్షాలు విస్తారంగా కురిసి పాడి పంటలు బాగా పండాలని మహిళలు బోనాలతో నైవేద్యాలు సమర్పించారు. కొడంగల్ పెద్ద చెరువు కట్టపై ఉన్న ఎల్లమ్మ దేవతకు బోనాలతో మహిళలు శుక్రవారం నైవేద్యాలు సమర్పించారు. తెలంగ్‌వాడీ చేపలసంఘం ఆధ్వర్యంలో మహిళలు బోనాలతో ఎల్లమ్మ దేవత ఆలయానికి చేరుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కిష్టయ్య, కుర్మయ్య, బైండ్ల ఆనంద్, సాయిలు, బలరాం పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని ఖాజాఅహ్మద్‌పల్లి గ్రామస్థులు మైసమ్మతండా శివారులో గల అడవుల మైసమ్మ దేవతకు పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

కట్టమైసమ్మ బోనాలకు ఏర్పాట్లు పూర్తి

మేడ్చల్ టౌన్: మేడ్చల్‌లో ప్రతీ సంవత్సరం వైభవంగా నిర్వహించుకునే కట్టమైసమ్మ తల్లి బోనాల ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోనాల ఉత్సవాలు 30వ తేదీన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం (నేడు) సాయంత్రం నుంచి బోనాల ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

అధ్యాపకుల సేవలకు చిరస్థాయి గుర్తింపు



అధ్యాపకుడు గురుపాదం దంపతులను సన్మానిస్తున్న తోటి అధ్యాపకులు

మర్పల్లి, జూన్ 28: విధినిర్వహణలో అధ్యాపకులు అందించే సేవలకు చిరస్థాయి గుర్తింపు ఉంటుందని డీఐఈవో శంకర్‌నాయక్ అన్నారు. మర్పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా పని చేస్తున్న గురుపాదం ఉద్యోగ విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గురుపాదం దంపతులను సన్మానించారు. డీఐఈవో హాజరై మాట్లాడుతూ మారుమూల గ్రామం మర్పల్లి జూనియర్ కళాశాలో ఓకేషనల్ అధ్యాపకుడిగా దాదాపు 34సంవత్సరాలు పాటు ఒకేచోట విధులు నిర్వర్తించడం గర్వించదగ్గ విషయమన్నారు. ఎంతో మంది పేద విద్యార్థులకు తాను సేవలందించి విద్యార్థుల ఉన్నతికి దోహదపడ్డారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌లు నర్సింహారావు, రాజు, మహదేవ్, నర్సింహారెడ్డి, అధ్యాపకులు రాజమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పీవీ నర్సింహారావు జయంతి



మొక్కలు నాటుతున్న కౌన్సిలర్ దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్

మేడ్చల్ టౌన్, జూన్ 28: మాజీ ప్రధాని పీవీ నర్సింహ్మారావు జయంతిని పురస్కరించుకుని శుక్రవారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ సబ్‌స్టేషన్ పరిధిలో స్థానిక కౌన్సిలర్ దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పీవీ నర్సింహ్మారావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీవీ దేశం అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు.